# చిందు

చిందు అనగా నృత్యంచేసేటప్పడు వేసే అడుగు చిందు. చిరకాలంగా వస్తున్నకళ. ఈ కళ ప్రదర్శించువారు మాదిగ కులస్థులు. పగటిపూట వీధిలో ఆటలాడే మాదిగలను చిందు మాదిగలన్నారు. ఈ కళారూపం అతి ప్రాచీనమైనది. ఇతరకళాకారుల మాదిరిగానే వీరు కూడా ఊరూరు తిరుగుతూ ప్రదర్శనలిస్తూ జీవనం సాగిస్తుంటారు. తెలంగాణాలోని హరిజనులకు గురువులుగా ప్రసిద్ధిపొందిన ముత్తలయ్యవార్ల మాదిరిగా చిందు మాదిగలు కూడా నాటకాలు ఆడుతారు. ఈ చిందు మాదిగలకు జాంబకదాసులు అనేపేరు కూడా ఉంది. వీరి మత గ్రంథం జాంబపురాణం అని చెబుతారు. తమకులానికి జాంబవంతుడు మూలపురుషుడని, అరుంధతి తమ ఆడపడుచని, జమదగ్ని భార్య రేణుక తమ 'ఇలవేల్పు" అని చెప్పకుంటారు. వీరు గరుడాచలం, హరిశ్చంద్ర, మైరావణ మొదలయిన నాటకాలను వీధి భాగవతం పద్ధతిలో ఆడుతుంటారు.

చిందు బృందంలో 15 మంది ఉంటారు. చిందువేసేవారు ఐదుగురు, కర్రసాము చేసేవారు నలుగురు, తప్పెటలు కొట్టేవారు ఆరుగురు ఉంటారు. వీరిని ఎక్కువగా తిరునాళ్లకు, అమ్మవారి సంబరాలకు పిలుస్తుంటారు. అప్పడు ప్రజలముందు చిందులు వేస్తూవుంటారు. శ్రీ బ్రహ్మంగారి ఆరాధనకి, ఎడ్లపందాలప్పడు కూడా వీరి ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. వీరు వారి ప్రదర్శనను సాధారణంగా చిన్ని కృష్ణుని నృత్యంతో మొదలుపెడతారు. ఇందువల్ల వైష్ణవ సాంప్రదాయకళాకారుల యొక్క ప్రభావం వీరిపై ఉన్నట్లు తెలియచేయుచున్నది. వీరి ఆహార్యం : స్త్రీ, పురుషులు వారి దుస్తులతోపాటు అంగవస్త్రం భుజాలపై వేసుకొంటారు.

కొన్ని ప్రాంతాలలో అమ్మవారి జాతర్ల సందర్భంగా మాల ఆసాదులు (కుల పురోహితులు) పాటలు పాడుతుంటే మాదిగ ఆసాదులు (కులపురోహితులు) చేడిగవాయిస్తూంటారు. జాతర్లలో ముఖ్యులైన మాతంగ కన్యలు, పూనకం వచ్చాక ఒక కర్రతో ఊరివాళ్లను కొడుతూ పవిత్రులను చేస్తూవుంటుంది. మాతంగ కన్యకూడా అమ్మవారి పాటలు పాడుతూ ఉంటుంది. చిందు భాగవతులు వారియొక్క సాంప్రదాయ పద్ధతులను యిప్పటికీ పాటిస్తున్నారు. వారు తమపాటలలో కాంభోజి, ఆసావేరి, మోహన, తోడి, రాగాలతో రూపక, ఆది మరియు త్రిపుట తాళాలను ఉపయోగిస్తారు.